
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర




*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# రాకుమారి!!

"ముఖాన ముడతలొస్తున్నాయిరే, నెత్తిమీదైతే అర ఎకరం పోయింది, ఇంకా నచ్చిన పిల్ల దొరకడంలేదురా? అని నిన్నటివరకూ గొడవ చేసేవాడివి. అదీ కాక పెళ్ళి చూపుల్లో కీర్తి ని చూస్తూనే 'భలే ఉందక్కా! ' అన్నావు, ఆ తర్వాత 'చాలా బాగా మాట్లాడిందక్కా! ' అంటూ కబుర్లు చెప్పావు.అలాంటిది ఈ రోజు ఇలా మాట్లాడుతున్నావంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది రాజూ! " అంది సాధన.

" అనవమ్మా తల్లీ! నువ్వూ నన్నే అను!" అన్నాడు రాజు కోపంగా.

" అయ్యా భూపతిరాజు గారు! మిమ్మల్నేమీ అనను, కానీ కాసేపు నిజాలు మాట్లాడుకుందామా?" అంది సాధన వ్యంగ్యంగా.

" నిజాలు కాక ఆవిడగారి గురించి అబద్ధాలు సృష్టించి చెప్పాల్సిన అవసరం లేదు నాకు. నువ్వన్నట్టు నిజాలే మాట్లాడుకుందాం. అయినా 'రాజావారు' అంటూ నువ్వేమీ వెక్కిరించక్కరలేదు. ఎవరు అవునన్నా, కాదన్నా మా ఊరికి నేను రాజానే!" అన్నాడు రాజు ఉక్రోషంగా.

" మా కాదు, మన, మనిద్దరిదీ ఒకే ఊరు" అంది సాధన నవ్వుతూ. "ఐనా కాదన్నదెవరు? దానికి నీకున్న సమస్యకి సంబంధమేమిటి? నన్నడిగితే సమస్యనేదే లేదు, ఒకవేళ ఉందని నువ్వనుకున్నా, నువ్వు రాజావి అయితే ఈ విషయం నిన్నసలు బాధ పెట్టకూడదుగా?" అంది తనే.

" అవున్లే! చిన్ననాటి స్నేహితురాలివని, అక్క లాంటిదానివనీ నీతో చెప్పాను చూడు! నాదే తప్పు! నువ్వో అమ్మాయివైయుండి అమ్మాయినే తప్ప నన్ను సమర్థిస్తావనుకోవడం నాదే బుద్ధి తక్కువ " అన్నాడు కోపంగా.

" కాదు రాజు! సాధన అన్నదాంట్లో తప్పేముంది? ఆ మాటకొస్తే కీర్తి అన్నదాంట్లోనూ తప్పేమీ లేదే! తల్లితండ్రులకి కొడుకులెంతో, కూతుళ్ళూ అంతే కదా!" అన్నాడు అమర్ అప్పుడే చెయ్యి కడుక్కుని టేబిల్ దగ్గరకి వస్తూ.

ముగ్గురూ భోజనం చేస్తూ ఉండగా చర్చ కొనసాగింది.

" రాజూ, సాధన సరదాకన్నా నిజమే అంది కదా! కారణాలేమైనా మీకు కావలసిన అమ్మాయి దొరకలేదు చాలా రోజులు. మీ ఇంట్లో పడే తొందరకీ మీరు కోరిన కోరికలకీ, ఇలా అంటున్నానని తప్పుగా అనుకోకండి. నిజం మాట్లాడుకుందాం అనుకున్నారు కదా! అని అంటున్నాను.

మీ కోరికలకీ, మీ ఇంట్లో వారి అంచనాలకీ సరిపడ అమ్మాయైతే అసలు పుట్టిందా? అనుకున్నాం కదా ఆ మధ్యన. అదృష్టవశాత్తు మీరు అనుకున్న రీతిలో చక్కని అమ్మాయి, అది కూడా ఎంతో తెలివైనది, స్వతహాగా తన తెలివితేటలతో మెరిట్ మీద చదువుకున్న డాక్టర్ ఆమె. చాల ఆత్మాభిమానం, ఆత్మ విశ్వాసం ఉన్న అమ్మాయి కీర్తి. " అంటూ ఆగాడు అమర్ రాజు ముఖంలో మారుతున్న భావాలని చూస్తూ.

" పైకందరూ అలాగే కనిపిస్తారండీ! ఇంట్లో చూస్తే తెలుస్తుంది నా బాధేమిటో! " అన్నాడు రాజు ఆవేశంగా

" ఏం బాధ పడిపోతున్నావో కాస్త చెప్పు! " అంది సాధన.

" మా ఇద్దరికీ దేన్లోనూ కుదరడం లేదు, ఇంట్లో ఉండే సమయంతో సహా. తను పొద్దున్నా, సాయంత్రం రెండు షిఫ్ట్ ల్లో పని చేస్తుంది రెండు హాస్పటల్స్ లో. మధ్యాహ్నం రెండు గంటలుంటుంది ఇంట్లో, అప్పుడు నేనాఫీసులో. పొద్దున్నే లేచి టిఫిన్, వంటా చేసేసి వెళ్ళిపోతుంది. నేను నిద్రలేచేసరికి తను ఉండదు. సాయంత్రం ఇద్దరిలో ఎవరు ముందొస్తామో తెలీదు. ప్రతీదీ ప్లాన్ ప్రకారం జరగాలంటుంది, అన్నింటికీ లెక్కలుండాలంటుంది. ఇంట్లో భోజనం తప్ప నాకేమీ తేడా కనిపించడం లేదు జీవితంలో! ఎవరికైనా చెప్తే 'డాక్టర్ల టైము వాళ్ళ చేతిలోనే ఉండదు,అన్నిట్లోనూ నీకు అనుగుణంగా ఉంటూ, ఎంతో అన్యోన్యంగా ఉంటోంది కదా అని నన్నే తప్పుపడుతున్నారు.

అది కాక వాళ్ళ చెల్లెలిని కాలేజీలో చేర్పించింది ఇక్కడ, ఆ పిల్ల మధ్య మధ్యలో వస్తుంది. నాకు చికాకు. ఇవన్నీ రెండు షిఫ్ట్లోంచి ఒకదానిమీద వచ్చే ఆదాయమంతా వాళ్ళ అమ్మా, నాన్నలకిస్తుందిట. అదెలా కుదురుతుంది?. నాకు పిచ్చి కోపం వచ్చిందామాట వింటూనే." అంటున్న రాజుని చూస్తూ శాంతంగా అడిగింది సాధన.

" తను సంపాదించే దాంట్లో సగం వాళ్ళ వాళ్ళకి ఇస్తానని పెళ్ళికి ముందే చెప్పిందన్నావు కదా! నువ్వు ఆ మాటకి ఒప్పుకున్నావు కూడా మరి ఇప్పుడిలా అంటే ఎలా?"

"ఇవ్వడమంటే ఏ ఆరునెల్లో ఇస్తుందనుకున్నాను కానీ తన తమ్ముడూ , చెల్లీ సెటిల్ అయ్యేవరకూ అని నాకేం తెలుసు? పెళ్ళి మొత్తం మా ఖర్చే, అది కాక ఇది కూడానా ? పైగా నీలాగే ముందే చెప్పాను కదా, మన మధ్యన ఆ ఒప్పందం జరిగాకే మన పెళ్ళి అయింది కదా! నన్నెంతో కష్టపడి ప్రేమగా పెంచారు, శక్తికి మించి చదివించారు అంటుంది పెద్ద రాకుమారిలా." వెటకారం రాజు గొంతునిండా.

నాన్నకొచ్చే జీతంతో ఇల్లుగడపడమే ఎక్కువ, మీకు తెలుసుకదా, వాళ్ళిద్దరికీ సహాయం చెయ్యడం నా ధర్మం! "మీరు , నేను ఎన్ననుకున్నా పరవాలేదు కానీ మా వాళ్ళని మాత్రం అనవద్దు, మీకంతగా నేను చేసే పనులు నచ్చకపోతే మా ఇంటికెళ్ళిపోతాను అంటోంది, నన్ను బెదిరిస్తుందా?" అన్నాడు రాజు.

కోపంగా ఏదో అనబోతున్న సాధన చేతిమీద చెయ్యి వేసి ఆగమన్నట్టుగా సైగ చేస్తూ

" రాజూ! నిజానికి ఇవి మీ ఇద్దరూ కూర్చుని మాట్లాడుకోవలసినవి, మూడో మనిషి జోక్యం కలిగించుకోకూడని విషయాలు చెప్పాలంటే. మీకు మా దగ్గరున్న చనువుతో చెప్పారు, మేము మీ పట్ల అభిమానంతోనే చెప్తున్నాము, ఆపైన మీ ఇష్టం "అంటూ భోజనం ముగించి లేచాడు అమర్. అతను మొదటినించీ అంతే, తను చెప్పదలుచుకున్నదేదో చెప్పేసి వదిలేస్తాడు. ఊరికే తెగేదాక లాగడం, అనవసరపు వాదనలు చెయ్యడం అతని పద్ధతి కాదు.

సాధనా, రాజూ మిగిలారు.

" అయితే ఏమంటావిప్పుడు? కీర్తి తన వాళ్ళకి ఏమీ ఇవ్వకుండా నీకిస్తే నువ్వు బెంజ్ కార్ కొనుక్కుంటావు, టైం షేర్ లో పెద్ద రిసార్ట్ లో మెంబర్షిప్ తీసుకుంటావు. వాళ్ళవాళ్ళు ఎలా పోయినా నీకు పరవాలేదు. నీవాళ్ళందరినీ కీర్తి తన వాళ్ళనుకోవాలి. నీ చెల్లెలొస్తే హాస్పటల్ కి లేట్ ఐనా సరే ఆంలెట్స్, కట్లెట్స్ వేసి పెట్టాలి కానీ నువ్వు వాళ్ళ గురించి ఏమీ పట్టించుకోవు" అంతేనా!!" ఈసారి సాధన కంఠంలో ఆవేశం.

కాసేపు వాదోపవాదనల తర్వాత రాజు లేచాడు వెళ్తానంటూ

"ఉండు, కీర్తికి కొద్దిగా భోజనం పెట్టి ఇస్తాను" అంటూ డబ్బాలు సర్ది ఇచ్చింది సాధన. మౌనంగా తీసుకుని వెళ్ళాడు.

మరో నాలుగు  రోజులు ఏ కబురు లేదు రాజు దగ్గరనించి. ఫోన్ చేస్తే' నాట్ రీచబుల్' అంటోంది, కీర్తి ఫోన్  'కాంట్ టాక్ నౌ" అంటోంది. ఏం జరుగుతోందో సాధనకర్థం కాలేదు. కీర్తి పనిచేసే హాస్పటల్ కి చేస్తే వారం రోజులు శలవు పెట్టిందని, వాళ్ళ ఊరు వెళ్ళిందని తెలిసింది. "ఈరోజైనా వీడింటికి వెళ్ళి చూసి రావాలి, సాయంత్రం అమర్ వచ్చాక!' అనుకుంది సాధన.

సాధనకి, ఆమె తమ్ముడికీ స్నేహితుడు రాజు. చిన్నప్పటినించీ ముగ్గురూ ఒకదగ్గరే పెరిగారు. బాగా ఆస్థి పరులు, కావలసినంతమంది మందీ మార్బలమూ ఇంట్లో, యువరాజులాగే పెరిగాడు.  రాజు పుట్టిన చాలా కాలానికి అతని చెల్లెలు శ్రావ్య పుట్టింది, ఆ పిల్లని గారం చేస్తూ ఒక్క నిమిషం కిందకి దింపకుండా చూసుకునేవారు. వీటన్నింటివల్ల తెలియకుండానే ఇద్దరికీ మంకు పట్టే, మొండితనమే, తాపట్టిన కుందేలుకి మూడేకాళ్ళనే వ్యవహారమే. రాజు ఎప్పుడూ సాధనా, తమ్ముడు సతీష్ లతోనే ఆడేవాడు. అలా తమ్ముడికంటే ఎక్కువ అయిపోయాడు ఆమెకి.

పడుతూ లేస్తూ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అక్కడొద్దు, ఇక్కడొద్దు అసలొకరి కింద ఉద్యోగమే వద్దు అంటూ గునిసి, రెండు మూడేళ్ళు కాలయాపన చేసి ఆఖరికి తప్పని పరిస్థితుల్లో ఉద్యోగంలో చేరాడు. అప్పటికే వాళ్ళ నాన్నగారి ఖర్చులకి కరుగుతున్న ఆస్థిపాస్థులు, ఇంట్లో కూర్చుంటే చాటున వెక్కిరించే జనమూ దానికి కారణాలు.

అక్కడనించీ రోజూ ఆఫీసులో దేనికో దానికి గొడవే, ఒక్కోసారి మేనేజర్ తో, మరో సారి తోటి ఉద్యోగులతోటి. పని ఎక్కువయిందనో, జీతం సరిగా పెంచలెదనో, లేదంటే కేంటీన్లో తిండి బావులేదనో దేనికో దానికి సాధిస్తూనే ఉండేవాడు. "వీడికెప్పుడూ జీవితంలో తృప్తి అనేది ఉండదక్కా, వదిలెయ్! " అనేవాడు సతీష్ రాజు గురించేదైనా చెప్పబోతే.

అలాగే వచ్చిన సంబంధానికల్లా వంక పెడుతూ తన తోటివాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల తండ్రులవుతున్నా కూడా జాప్యం చేస్తూ ' తనకి తగ్గ పిల్ల పుట్టనేలేదన్న భ్రమ లో గడిపేశాడు చాలా కాలం. కీర్తి సంబంధం  కూడా ఒక పట్టాన ఇష్టపడలేదు, అమ్మాయిని చూసేవరకూ.

"వాళ్ళకేమీ లేదక్కా! మనకెంత పరువు తక్కువ, ఎక్కడా గతిలేక చేసుకున్నామనుకుంటారందరూ?" అంటే తనే తిట్టింది.

ఏకాలపు మాటలివి? ఎవరికోసమో చేసుకుంటావా పెళ్ళి? అమ్మాయినీ, చదువునీ, సంస్కారాన్నీ చూడు, కుటుంబ ఆర్ధిక పరిస్థితులు కాదని కేకలేస్తే పెళ్ళి చూపులకి ఒప్పుకున్నాడు.

అమ్మాయి లక్షణంగా ఉంది, చాలా చక్కగా మాట్లాడింది, ఎంతో మర్యాదగా ప్రవర్తించారు వాళ్ళు. దానిగురించి మంచిగా చెప్పబోతే " వాళ్ళకేమీ లేదు, అలా ఉంటే మనతో పని అవుతుందనుకుని ఉంటారు" అన్నాడు. మళ్ళీ కోప్పడింది.

అన్నాడే కానీ కీర్తి బాగా నచ్చింది రాజుకి. అందుకే ఆ అమ్మాయి, వాళ్ళ నాన్నగారు అడిగిన వాటికల్లా కాదనలేకపోయాడు. తను తన తల్లితండ్రులనాదుకోవలసిన విషయం ఆమె ముందే చెప్పింది. అలాగే పెళ్ళి ఖర్చుల విషయంలో వాళ్ళ స్థాయి కూడా ఏమీ దాచకుండా చెప్పారు. వారిస్తానన్నది కొద్ది మొత్తమే కనక అదీ వద్దని, తమ స్థాయికి తగ్గట్టు తామే వివాహం చేసుకుంటామని రాజు నాన్నగారే అన్నారు. అయినా వాళ్ళివ్వదలచినది ఇచ్చారు.

"ఎలాగైతేనేం మొత్తానికి రాజో ఇంటివాడయ్యాడు" అనుకున్నారు సాధన, సతీష్.

పెళ్ళి అయిన మూడో నెలనించీ ఏదో ఒక విషయం లో గొడవ పడుతూనే ఉన్నారు. ఆత్మాభిమానం ఎక్కువ గల పిల్ల కీర్తి, వెటకారాన్ని తట్టుకోలేకపోయేది. ఏదైనా ఉంటే స్నేహితుల్లా చెప్పుకుని పరిష్కరించుకోవచ్చు కదా అనేది ఆమె వాదన. రాజుకేమో ఇవన్నీ పట్టదు, తన ధోరణేదో తనదే.. ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చున్న సాధన తన ఫోన్ మోత కి ఉలిక్కిపడింది.

రాజు ఫోన్.. అధాట్టున ఎత్తింది..

" ఏమైపోయార్రా వారం నించీ? నాలుగురోజులనించీ? కీర్తినేమన్నావు? ఊరు వెళ్ళిందిట?" అంటున్న సాధనని ఆపి..

" అక్కా, శ్రావ్య సూయిసైడ్ ఎటెంప్ట్ చేసింది. ఇప్పుడు పరవాలేదనుకో, కానీ గత రెండురోజులు నరకమే! " ఏడుస్తున్నాడు ఫోన్ లో.

" వాట్! శ్రావ్యా? ఎక్కడున్నారిప్పుడు? నేను వస్తానుండు? ఇంత జరిగితే ఇప్పుడా ఫోన్ చెయ్యడం? ఇంక మాట్లాడకు. వస్తున్నా నేను" అంటూ చెప్పులేసుకుని పర్స్ తీసుకుని బయలుదేరింది..

"అక్కా, శ్రావ్య! " అంటూ చేతులు పట్టుకుని ఏడ్చేశాడు సాధనచూడగానే.

" పరవాలేదండి, షీ ఈజ్ ఔట్ ఆఫ్ డేంజర్! నిన్న తీసుకొచ్చాం ఇక్కడకి.. "

“రాజూ, మీరు కంగారు పడి, అందరినీ కంగారు పెట్టకండి, నేను చూసుకుంటానుగా. “ అంటోంది కీర్తి నెమ్మదిగా రాజు చెయ్యి నొక్కుతూ.. ఎంతో మార్దవంగా ఉన్న స్పర్శ, మృదువుగా ఉన్న మాట

" అమ్మయ్యా, అనుకుంది ఐసీయూ అద్దంలోంచి శ్రావ్యని చూస్తూ. తమ కళ్ళముందు పెరిగిన పిల్ల, ఎందుకు జరిగిందిలా? " అనుకుంది బాధగా.

“పరవాలేదంది కదా! అసలేమయింది? విషయం చెప్పు!" అంది సాధన కేఫిటీరియాలో అతని ఎదురుగా కూర్చుంటూ..

" వాడు, అదే సౌరభ్, వాళ్ళమ్మా కలిసి కొత్తకోడలనైనా చూడకుండా ఒకటే సాధింపులుట. మీరేదో జమీందార్లని విని, మీ నాన్న ఇచ్చినవాటికే ఒప్పుకుని చేసుకున్నాం, అంత ఆస్థేమైనా కట్టుకుపోతాడా? ఎప్పటికైనా నీకు, మీ అన్నకే కదా ఇవ్వాల్సింది కదా ఇవ్వాల్సింది, అ ఇచ్చేదేదో ఇప్పుడే ఇస్తే కాదా? పెద్ద కార్ కొనాలని ఆశ వాడికి. మీ నాన్ననడిగితే మాకు మునుపటంత వైభవం లేదక్కగారు, ఉన్నంతలో అన్నీ ఎక్కువే ఇచ్చాను అంటాడా? పైగా మీ అన్నయ్య పెళ్లికి కూడా ఖర్చు పెట్టానంటాడా? మీ వదినేమో డాక్టర్, హాయిగా నాలుగు చేతులా సంపాదిస్తుంది,నువ్వేమో ఇల్లు దాటని సుకుమారివి మరి! నీవల్ల మాకు రోజుకైదొందలు ఖర్చే కానీ దమ్మిడీ ఆదాయం లేదు. ఓ పనీ పాటా రాదు, ఏమైనా అంటే రాకుమారిలా పెంచామంటారు ఇలా సాధించేవారట అక్కా.!

నీకు తెలుసుగా దాని మనసెంత సున్నితమో! అనుకుంది ఐసీయూ అద్దంలోంచి శ్రావ్యని చూస్తూ. తమ కళ్ళముందు పెరిగిన పిల్ల, ఎందుకు జరిగిందిలా? అనుకుంది బాధగా. పసిది, ఇవన్నీ విని తట్టుకోలేకపోయిందిట. చేతికందిన మందేదో తాగేసి తెలివి లేక పడిపోయింది. ఫోన్ చేస్తే పరిగెత్తుకుని వెళ్ళాం.

ఈ కాలంలోనూ ఇలాంటివి ఉంటాయా? అనిపించిందక్కా వింటూఉంటే!చదువుకున్న మూర్ఖుడు సౌరభ్! అంతకంటే ఏమనాలో తెలియడం లేదు. ప్రపంచాన్ని చూడక పోతే ఇలాగే ఉంటుంది, దగ్గరే బాంకుద్యోగం, హాయిగా స్వంత ఊర్లో ఉంటానని కూర్చున్నాడు కదా, అంతకంటే ఆలోచనలెలా వస్తాయ్ చెప్పు? కూపస్థ మండూకం లా తనున్న ప్రపంచం, తను చెప్పిందే వేదం అనుకుంటాడు లావుంది, లేకపోతే ఆ తల్లికి అతనైనా చెప్పకూడదా?"

ఆవేశంలో సరసరా శరాల్లా వస్తున్నాయి రాజు నోట్లోంచి మాటలు.

“నగరజీవితం మన పరిధినేమాత్రం విస్తృత పరిచిందంటావ్? “కాజువల్ గా అంది సాధన.

దెబ్బ తిన్న పక్షిలా చూశాడు సాధన వైపు.

"అలా అంటావేమిటక్కా? నీకు తెలీదు దాన్నెలా పెంచామో? రాకుమారి కదూ! అలాంటి పిల్లని అలా మాటలని బాధ పెడుతుంటే ఎలా తట్టుకోవడం? రక్తం మరిగిపోదూ, నీకెలా ఉందో కానీ నాకైతే ఇప్పుడే ఆ సౌరభ్ గాడిని కసితీరా తన్నాలని ఉంది. తల్లి మాటలకి వత్తాసు పలికేవాడు ఓ మగాడేనా?అమ్మా, నాన్నలకి చెప్తే బాధపడతారని పిన్నికి చెప్పిందిట రెండు మూడు సార్లు.. "

" నేనన్నది నీకర్ధం కాలేదురా! ఆవేశంలో ఉన్నావు. మంచినీళ్ళు తాగి ఆలోచించు. నగరజీవితం, మనమనుకుంటున్న ఎక్స్పోజర్ మన ప్రవర్తనేవిధంగా మార్చింది? మనింటికొచ్చిన రాకుమారికి ఎలాంటి అనుభవాలనిచ్చింది? అదే నేనడిగేది" అంది శాంతంగా..

ఆవేశం కాస్త తగ్గి ఆమె చెప్పదలుచుకున్నదేమిటో తెలిసిన రాజు వెంటనే మాట్లాడలేదు.

" నువ్వు ఫోన్ చెయ్యనే లేదు శ్రావ్య పరిస్థితి గురించి. అయినా కీర్తి తన ఇంటినించి పరిగెత్తుకుని వచ్చింది. "

" నువ్వు డాక్టర్ వి కదమ్మా, నువ్వొస్తే ధైర్యం" అని పిన్ని ఫోన్ చేస్తే. "నువ్వా విషయం కూడా ఆలోచించలేదే? " ఆమె వచ్చి వెంటనే శ్రావ్య ని సిటీకి తీసుకొచ్చి పరిస్థితిని తన కంట్రోల్ లోకి తెచ్చుకుని ఎంత సంయమనంతో ప్రవర్తిస్తోందో చూశావుగా? మనిషి తత్వాన్ని చెప్పే పరిస్థితులంటే ఇవే! పైగా నీకు ధైర్యం చెప్పిందే! అది నేనున్నానన్న ధైర్యం రా! ఎప్పటికి తెలుసుకుంటావాపిల్లని? ఇవేవీ తోచలేదు కదూ నీకు? నీ చెల్లెల్లాగే ప్రతీ ఆడపిల్లా మరొకరికి చెల్లెలో, అక్కో.. కానీ తన ఇంటికి రాకుమారే. దానికి డబ్బుతో పనిలేదు. నువ్వు పెద్ద రాకుమారి అని వెక్కిరించిన పిల్ల నిజానికి పెద్ద మనసున్న మహరాణిరా., " అని ఒక్క సెకను ఊపిరి తీసుకోవడానికి ఆగింది.

" వాళ్ళని పల్లెటూరివాళ్ళు, అందుకే వాళ్ళ ఆలోచనా పరిధి ఇదే అని గేలి చేస్తూ తేలిగ్గా మాట్లాడుతున్న నువ్వు వాళ్ళకీ, నీకు ఉన్న తేడా ఏమిటి అనో, అసలుందా లేదా అనో ఒక్కనిమిషమైనా ఆలోచించావా? ఇప్పటికైనా అర్థం లేని ఆలోచనలు మానేసి కీర్తిని క్షమించమని అడుగు" అని చెప్పాలనుకున్న మిగతా మాటలు చెప్పే అవసరమే ఆమెకి రాలేదు. కీర్తి కన్సల్టింగ్ రూం వైపుకి పరుగులాంటి నడకతో వెళుతున్నాడు రాజు అప్పటికే!

COMMENTS